క్లుప్తంగా

'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అర్హులైన ఎస్సీ, బీసీ, మైనార్టీలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజ్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు గతంలో ఒకే వర్గానికి పంపిణీ చేశారని ఆరోపించారు. మళ్లీ అలా చేయకుండా జనాభా ప్రతిపాదికను అర్హులైన బీసీ, ఎస్సీ, మైనార్టీలకు పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జయరాజు, కనకరాజు, రాజు, ఉదయ్‌కాంత్, శ్యామ్, శ్రీను, రామకృష్ణ, శాంతిరాజు, దాసింబాబు, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 7న వేంకటేశ్వర కల్యాణం

అశ్వాపురం: మండల పరిధిలోని సంద్రలబోడు గ్రామంలో బండ్లసిరిగుట్ట శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి 17వ వార్షిక కల్యాణ మహోత్సవం మార్చి 7 నిర్వహించనున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పూజారులు, ఆలయ కమిటీ వారు భక్తుల సమక్షంలో శనివారం కల్యాణ మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. మార్చి 5న స్వామి వారికి ప్రత్యేక పూజలు, భజనలు, గ్రామదేవతకు ప్రత్యేక పూజలు, 6న స్వామి వారికి పంచామృత అభిషేకాలు, గ్రామాలలో స్వామివార్లను రథంపై మేళతాలాలతో ఊరేగించి పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించడం, 7న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, 9న నాగవల్లి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నూతన ఆలయం నిర్మాణం సందర్భంగా భక్తులు తమ వంతు సహాయసహకారాలు అందించాలని ఆలయ కమిటీ వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'నిర్వాసితులను మోసం చేస్తున్న అధికారులు'

దుమ్ముగూడెం: సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూసేకరణకు అతి తక్కువ నష్టపరిహారం చెల్లించి, అదనంగా భూమి సేకరిస్తూ అధికారులు తమను మోసం చేస్తున్నారని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సీతానగరం గ్రామంలో సమావేశమైన చర్ల, దుమ్ముగూడెం సీతమ్మ సాగర్ నిర్వాసితులు మాట్లాడుతూ.. రైతాంగానికి కనీసం సమాచారం తెలుపకుండా అధికారులు సరిహద్దులు జెండాలు పాతుతున్నారని, ఖచ్చితంగా ఇది వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. గతంలో సేకరించిన భూములకు నామమాత్రపు సొమ్ము చెల్లించి ఇప్పుడు అదనంగా భూములను చెప్పచేయకుండా తీసుకుంటున్నారని అన్నారు. సమావేశంలో కొమరం దామోదరరావు, వాగె ఖాదర్ బాబు, దుమ్ముగూడెం, చర్ల మండలాల సీతమ్మ సాగర్ ప్రాజెక్టు భూ నిర్వాసితులు సున్నంవెంకటి, వెట్టి సీతయ్య, పొడియం బొజ్జి, పూనెం భూపతి, తుష్టి కామరాజు, వాగె రాజు, నరసింహారావు, శకునం శ్రీనివాస్, మట్టాచిన్నయ్య, గొరారపు శ్రీనివాస్, పార్వతి, సమ్మక్క, మహాలక్ష్మి, గోపమ్మ, వాగె ముత్తమ్మ, పూనెం లక్ష్మి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ అత్యవసర సమావేశం సున్నం ప్రశాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు యు.దుర్గారెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ఈనెల 20న ఐటీడీఏ ఎదుట మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక శాతం ఆదివాసీ గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆదివాసీలు హక్కుల కోసం ఉద్యమానికి సిద్ధం కావాలని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆనాడు 1976లో లంబాడీలను డీఎస్టీలుగా కలిపి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసులకు అన్యాయం చేస్తే.. ఈనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం మరో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చిందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలంటే ట్రైబల్ అడ్వైజర్ కమిటీ ఆమోదం తెలపాలని, అదేమీ లేకుండా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం సమంజసం కాదన్నారు. ఆదివాసీ సమాజం రాబోయే తరాలను ఉద్దేశించి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బూర్గంపాడు మండలం అధ్యక్షులు పాయం పాయం రాజేష్, దుమ్ముగూడెం మండలంలోని నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా శివరాత్రి



భద్రాచలం: రామలింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

శివనామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగాయి. వాడవాడలా మహాశివరాత్రి వేడుకలు శనివారం వైభవంగా.. భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేయగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్న సమయంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి శివాలయాల్లో శివపార్వతుల కల్యాణం వైభవోపేతంగా కొనసాగింది. కోరుకున్న కోర్కెలు తీరాలని భక్తులు.. ముఖ్యంగా మహిళలు శివజాగారాలు చేశారు. ఆయా ప్రాంతాల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: పడవల్లో మోతెగడ్డకు వెళ్తున్న భక్తులు



అన్నపురెడ్డిపల్లి: స్వామి వారి కల్యాణోత్సవంలో అర్చకులు, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ములకలపల్లి: ఉమాసమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో రుద్రహోమం..



దుమ్ముగూడెం: నర్సాపురం ఆలయంలో భక్తుల రద్దీ



గుండాల: శివాలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



అన్నపురెడ్డిపల్లి: మహాజలలింగం వద్ద స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



అన్నపురెడ్డిపల్లి: స్వామి వారికి అభిషేకం జరిపిస్తున్న అర్చకులు



అశ్వాపురం: వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ సుజాత, పాయం



మణుగూరురూరల్: స్వామి వారికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పురుషోత్తం దంపతులు



చర్ల: తేగడ శివరాత్రి ఉత్సవాలకు తరలివచ్చిన జనం



అశ్వారావుపేటరూరల్: నారంవారిగూడెం కాలనీ వద్ద అన్నదాన కార్యక్రమంలో భక్తులు..



భద్రాచలంటౌన్: బస్టాండ్ వెనుక శివాలయంలో స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు



చండ్రుగొండ: భక్తుల సౌకర్యార్థం లారీలు ఏర్పాటు చేసిన వీరభద్రుడి ఆలయ నిర్వాహకులు



మణుగూరురూరల్: మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్, వాసవి వనితా వైభవ్ క్లబ్ బాధ్యులు



అన్నపురెడ్డిపల్లి: స్వామి వారి దర్శనానికి బారులుదీరిన భక్తులు



అన్నపురెడ్డిపల్లి: ఆలయంలో హోమం జరిపిస్తున్న అర్చకులు..



స్వామి వారిని గంగాస్నానం అనంతరం ఊరేగింపుగా తీసుకువస్తున్న అర్చకులు, భక్తులు

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో ఉన్న దుర్గమల్లేశ్వర స్వామి ఆలయం వరకు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. శనివారం ముష్టిబండ నుండి వడ్లగూడెం వెళ్లే దారిలో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గుట్టపై ఉన్న మల్లేశ్వరుని ఆలయం వరకు కోటి రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు మంజూరు కాగా, ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆలయంలో దుర్గమల్లేశ్వరుని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని పలు శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు దారా యుగంధర్, సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావు, రావు గంగాధరరావు, సర్పంచ్ తిరుపతిరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

మెతెగడ్డకు ప్రత్యేక బస్సులు

భద్రాచలంటౌన్: మహాశివరాత్రి సందర్భంగా భద్రాచలం నుంచి మెతెగడ్డ వీరభద్రస్వామి వారి దేవస్థానం వరకు ఆర్టీసీ అధికారులు శనివారం ప్రత్యేక బస్సులను నడిపారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి భక్తులను నేరుగా గోదావరి ఒడ్డుకు చేర్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. బస్సుల్లో భక్తుల ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డిపో మేనేజర్ బి.రామారావు పర్యవేక్షించారు.



భక్తుల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద ఆర్టీసీ బస్సు..

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నీ



విజేతగా నిలిచిన సుందరయ్యకాలనీ జట్టు..

చర్ల: మండల కేంద్రమైన చర్లలో శనివారం జరిగిన చర్ల, దుమ్ముగూడెం మండలాల స్థాయి సమ్మక్క సారలమ్మ గ్రాండ్ వాలీబాల్ టోర్నీ ఉత్సాహభరితంగా సాగింది. ఈ పోటీలను చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, సివిల్ ఇంజనీర్ కొర్సా వెంకటేశ్వరావు లాంచనంగా ప్రారంభించారు. చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన సుమారు 30కు పైగా జట్లు రాగా ప్రారంభం నుంచి ముగింపు వరకు సాగిన క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ టోర్నీలో మొదటి స్థానంలో చర్ల మండలంలోని సుందరయ్యకాలనీ జట్టు, ద్వితీయ స్థానంలో దుమ్ముగుడెం మండలానికి చెందిన మారాయిగూడెం జట్టు, తృతీయ స్థానాన్ని చర్ల మండలంలోని సుబ్బంపేట జట్టు దక్కించుకున్నాయి. మొదటి బహుమతిగా షీల్డ్, రూ.20,116 నగదు, ద్వితీయ బహుమతిగా షీల్డ్, రూ.15,116 నగదు, తృతీయ బహుమతిగా షీల్డ్, రూ.10,116 నగదును అందజేశారు. సివిల్ ఇంజనీర్ కొర్సా వెంకటేశ్వరావు షీల్డ్, నగదు బహుమతులను సొంత ఖర్చులతో సమకూర్చగా.. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు, రాష్ట్ర కార్యదర్శి పాండ్రు హేమసుందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోయం రాజారావు, రైతుక్లబ్ చైర్మన్ కొత్తపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



భద్రాచలంటౌన్: సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న గిరిజనులు

భద్రాచలంటౌన్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని శనివారం పట్టణంలోని గిరిజన భవన్‌లో ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి భద్రాచలం గిరిజనాభివృద్ధి సహాయ అధికారి పి.నరసింహారావు పూలమాలలు వేసి పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి, వారి ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలిపిన మహనీయుడు సేవాలాల్ అని కొనియాడారు. కార్యక్రమంలో వాంకుడోత్ కృష్ణనాయక్, బాదావత్ బన్సీలాల్, బానోత్ కృష్ణ నాయక్, లకావత్ కృష్ణ నాయక్, బావసింగ్, హరిచంద్రనాయక్, నాగులు నాయక్, గోవిందు, తారచంద్ నాయక్, వీరన్న, సీతయ్య, మదార్‌నాయక్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

భద్రాచలంఅర్బన్: బ్రిటిష్ వారిని ఎదిరించడానికి బంజారాలందరినీ ఏకం చేసి పోరాడిన ధీరుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని భద్రాచలం ఏటీడీఓ నర్సింగరావు అన్నారు. శనివారం భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం పక్కన ఉన్న గిరిజన భవనంలో సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని పురస్కరించుకుని బంజారా, గిరిజన నాయకులు భోగ బండారో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజును స్ఫూర్తిగా తీసుకుని తామంతా ముందుకు పోవాలని అన్నారు. కార్యక్రమంలో లంబాడా ఉద్యోగ, ఉపాధ్యాయులు, కృష్ణ, బన్సీలాల్, వారిచంద్ర నాయక్, గోవింద్, నాగులు, వీరన్న, సైదులు, బావ సింగ్, సుదరు, భీష్మ, మోహన్లాల్, తారాచంద్, పూజారులు బిక్షం, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరాధ్య దైవం..

చండ్రుగొండ: మండలంలోని పోకలగూడెం గ్రామంలో గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ జిల్లా సమన్వయకర్త డాక్టర్ గుగులోతు రవిబాబు ఆధ్వర్యంలో వేడుకలు సాంప్రదాయంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గుగులోతు బాబు, గుగులోతు మీన, ఇస్లావత్ వీరన్ననాయక్, సేవియా, బలరాం నాయక్, భద్రు, రంగా పాల్గొన్నారు.

సింగరేణి క్వార్టర్లకు కౌన్సెలింగ్

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా పీవీకాలనీలోని కంపెనీ క్వార్టర్స్ కోసం శనివారం జీఎం కార్యాలయంలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. క్వార్టర్స్ ఏలాట్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సీ2 క్వార్టర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీ2 క్వార్టర్ల కోసం ఆరుగురు వ్యక్తులు దరఖాస్తు చేసుకోవడంతో ఆ ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించి కేటాయించడం జరిగిందని ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్ తెలిపారు. అదే విదంగా డిపెండెంట్ ఉద్యోగ నియామక అభ్యర్థులు ఐదుగురికి వారి అర్హతకు తగిన క్వార్టర్స్ కేటాయించడం జరిగిందని తెలిపారు. అత్యంత పారదర్శకంగా కార్మికులకు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, ఏజీఎం సివిల్ డి.వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, టీబీజీకేస్ నేత వీరభద్రం, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



కార్మికులకు క్వార్టర్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: దేశంలో మతోన్మాద శక్తులను తరిమికొట్టడమే అమరజీవి బండారు తులసికి ఇచ్చే ఘన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్, పార్టీ సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్ అన్నారు. పార్టీ మాజీ శాఖ సెక్రెటరీ బండారు తులసి 6వ వర్ధంతి సభ నాదెళ్ల లీలావతి అధ్యక్షతన జరిగింది. ముందుగా తులసి చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్, సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్‌లు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత ప్రాతిపదికన ప్రజలను విభజించి పాలిస్తోందని అన్నారు. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అమలు పరుస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని, అటువంటి బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసి మతోన్మాద శక్తులను తరిమి కొట్టాలని సూచించారు. భద్రాచలం నియోజకవర్గంలో సీపీఎం అభివృద్ధికి ప్రతి కార్యకర్తా దీక్షతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, సీనియర్ నాయకులు బీబీజీ తిలక్, జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటరామారావు, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలోనే మానులవుతున్నాయి!

అశ్వారావుపేటరూరల్: ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలు, ఒత్తిడి కారణంగా లక్ష్యాన్ని చేరేందుకు ఓ నర్సరీలో పెంచిన మొక్కలు ప్రస్తుతం మానులుగా ఎదిగాయి. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వాటిలో చాలా మొక్కలు చనిపోగా, మిగిలినవి వృథాగా పడి ఉన్నాయి. మండల పరిధిలోని వేదాంతపురం గ్రామ పంచాయతీలో గతేడాది హరితహారంలో భాగంగా నర్సరీలో 10వేల మొక్కలు పెంచారు. వీటి కోసం రూ.70వేల వరకు ప్రజాధనాన్ని ఖర్చు చేశారు. కాగా పంచాయతీ పరిధిలో ఈ మొక్కలను నాటేందుకు స్థలాలు లేకపోవడం, గ్రామస్తుల సైతం ముందుకు రాకపోవడంతో ఇంటింటికీ ఆరు మొక్కలు చొప్పున అందించి మిగిలిన దాదాపు మూడు వేలకు పైగా మొక్కలను నర్సరీలోనే వదిలేశారు. అనంతరం నర్సరీలో మూలుగుతున్న మొక్కలను పట్టించుకోకపోవడంతో వీటిలో వందల సంఖ్యలో మొక్కలు చనిపోయాయి. మిగిలిన మొండి జాతి మొక్కలు మాత్రం నర్సరీలోనే మానులుగా పెరుగుతున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి యాఖుబ్ అలిని 'సాక్షి'వివరణ కోరగా.. చిన్న పంచాయతీ కావడంతో మొక్కలు మిగిలిపోయినట్లు చెప్పారు. ఇలా మిగిలిన మొక్కలను కొద్ది రోజుల్లోనే మెగా పల్లె ప్రకృతి వనంలో నాటేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



నర్సరీలోనే ఏపుగా పెరిగిన హరితహారం మొక్కలు